# ఆడవారు! - ఆయుధాలు!

ఆడవారికి ఆయుధాల గిడ్డంగులు వంటిళ్ళే! రక్షణ నిమిత్తం ఏ దేశానికైనా స్వయంగ ఉత్పత్తి చేసుకోగల సామర్థ్యం కొరవడితే... అధునాతన ఆయుధాలను... అణువాయుధాలను దేశాలనుండి దిగుమతి చేసుకుంటయ్!

ఆడవాళ్ళ ఆయుధాల విషయంలో ప్రభుత్వాలకు దేశాలకు ఆ బాధలేదు. ఎంచక్కా ఎవరికి కావలసిన ఆయుధాన్ని మహిళామణులు వారికి అందుబాటులో వుండేవిధంగా కిచన్లో వుంచుకుంటారు (సారీ! దాచుకుంటారు).

ఏ గోడౌన్లోనో పెడితే వాటిని వెతికి దుమ్ము దులిపి తెచ్చుకుని వుపయోగించటంలో ఆలస్యం చోటుచేసుకుంటుందని ఆడాళ్ళ భయం!

ఆడవారికి ప్రత్యేకించి పోలీస్‌స్టేషన్లు... మహిళా పోలీస్ బృందాలు ఇప్పుడు వెలుగులో కొచ్చినయ్‌గాని వెనకటి రోజుల్లో ఇలాంటి అధునాతన సౌకర్యం అందుబాటులో మహిళలకు లేనందున... ఎవరికి తోచిన రీతిలో ఆయుధాన్ని ఎంచుకుని... వారికి అమిత దగ్గర్లో అనగా వంటింట్లో జాగ్రత్తగ భద్రపరచుకోవటమనేది వారికి వున్న అలవాటు. ఇది అనాదిగా... ఐమీన్... తరతరాలుగ వస్తున్న ఆచారం... లేదూ సంప్రదాయం!

ఆడవాళ్లకు వారు వుపయోగించే ఆయుధాల విషయంలో కన్నతల్లే ప్రత్యేకంగ శిక్షణ ఈయనవసరంలేదు. ఎందుచేతనంటే... సదరు జన్మనిచ్చిన తల్లి... ఆమె భర్తమీద ఎప్పుడెప్పుడు ఏఏ రీతిలో తిరగబడి... ఆయుధాన్ని ఏరూపంలో వాడుతుందో కూతుళ్ళు అతిసునాయాసంగ గ్రహిస్తారు గనక!

ఇంట్లో శ్రీమతికి వంటింట్లో తేలో... జెర్రో కన్పిస్తే దాన్ని హతమార్చటానికి... చెప్పుకోసం ఇల్లంతా పరుగులు పెట్టి చివరికి చెప్పు దొరికే సమయానికి ఆ తేలో జెర్రో జరజరా పాక్కుంటూ ఎటో వెళ్ళిపోయి కనుమరుగౌతయ్! వాటిని చంపగల అవకాశం చేజారిపోతుంది.

ఇలాంటి 'మిస్సడ్' కాల్స్ వంటి తెలివి తక్కువ పన్లకు తావీయకుడదనే ఆడంగులు... భర్తని దండించాల్సిన సమయాల్లో వాడవలసిన ఆయుధ సామాగ్రిని కిచన్లో చేతికి అందుబాటులో వుంచుకోవటం పరిపాటి!

అప్పడాల కర్రనుండి రోకలి బండ వరకు దగ్గర్లో వున్నవాటితో మహిళలు సర్దుకుపోతూంటారు. పక్కింటి పిన్నిగారిని ఉప్పో... పప్పో అప్పు అడిగి పుచ్చుకున్నట్టు ఆయుధాలను అరువు అడగవలసిన పన్లేదు.

గ్యాస్‌స్టౌ పక్కనే అట్లకాడ... తలుపు వెనకే చీపురు ఎప్పుడూ రెడీగ వుంటయ్.

చిన్నతనంలో నేను తప్పుచేసినందుకు మా అమ్మ (అప్పుడు కాన్వెంట్ చదువులు లేవు కనుక 'మమ్మీ' అనే పదం వాడలేదు. సారీ!) ఆమెకి చేరువలో ఉన్న ఇనుప అట్లకాడ పక్కనే వున్న బొగ్గుల కుంపటిలో ఎర్రగా కాల్చి నా అరికాలిమీద వడ్డించింది. అలాంటి తప్పు మళ్ళీ జన్మలో చేయకుండా వుండాలనే అమ్మ అంత కఠినమైన శిక్ష విధించి వాతపెట్టింది.

అట్లాగే... ఓసారి మా చెల్లెలు తప్పు చేసినందుకు చీపురు తిరగేసింది మా అమ్మ.

మా అమ్మ చెప్పిన మాట విననందుకు మా డాడీ చేయి చేసుకుంటే... మా అమ్మ రివ్వున వంటింట్లోకెళ్ళి అప్పడాల కర్ర తెచ్చి ఎదురు తిరిగి కళ్ళెర్ర చేయటం నాకు ఇప్పటికీ గుర్తు!

భర్త రాక్షసుడైనా... మేధకుడైనా... ఆడదాని అహం దెబ్బతిన్నప్పుడు ఎదురుదాడి చేయటం తప్పనిసరి!

గదిలో బంధించిన మార్జాలాన్ని వేధిస్తే అది మీదపడి రక్కుతుంది. గాయపరుస్తుంది. ఆడవాళ్లూ అంతే!

అసలు నన్నడిగితే ఎదురు తిరిగే అధికారం ఆడాళ్ళకి ఆ దేవతలే ఇచ్చేసారు! మీకు తెలీకపోతే పురాణగాథలు ఓపిగ్గా చదవండి!

చండి... దుర్గ... ఆదిగా గల దేవతలు కత్తులతో శూలాలతో రాక్షస సంహారం గావించినట్టు తెలుస్తుంది.

అనగా... అసలు తిరుగుబాటు ధోరణి స్త్రీ నెత్తురులోనే వుంది. ఇది డిసీజ్ కాదు కనుక నెత్తురు పరీక్షలో బహిర్గతంకాదు!

కోపం వస్తే... ముఖం జేవురిస్తుంది. కందగడ్డవుతుంది. కళ్ళు నిప్పుకణాలవుతయ్! ఈ లక్షణాలున్న కోపం తాలూకు మార్పులు శరీరంలో చోటు చేసుకునేవే! అందరికీ తెల్సిన విషయమే!

కాకపోతే... ఒకప్పుడు ఆడవారికి భూదేవి అంతటి ఓర్పు వుండేది కాబట్టి... ఎదురు

తిరిగి కాళికారూపం ఎత్తేవారు కాదు.

రోజులు మారేకొద్దీ... రాను రానూ మహిళల్లోనూ ఓర్పు తగ్గుతూ రావటంతో... అయినదానికి కాని దానికీ పెళ్ళాలు భర్తలను చెండుకు తినేవారి సంఖ్య పెరగటంతో... తిరుగుబాటు ధోరణి వారిలోనూ ఎక్కువశాతం కన్పిస్తోంది.

టీచర్ తన పిల్లవాడిని చెలి మెలేసి... కొట్టి ఎండలో నిలబెట్టాడనే విషయం మా ఎదురింటి పిన్నిగారికి తెలిసి... ఆమె ఉగ్రరూపం దాల్చి ఆ అయ్యవారిని రోకలిబండతో తలమీద మోదింది! ఆయన 'హరీ' అనకపోయినా ఆస్పత్రి పాలైనాడు. అది వేరే విషయం.

మా మేనత్త కూతురు నాలుగు ఎం.ఏ.లు చదివి తలనెరిసేక పెళ్ళి చేసుకుంది.

శోభనం రోజు రాత్రి మొగుడు మహాశయుడు పెళ్ళాన్ని దగ్గరకు లాక్కుని ముద్దాడి చక్కిలిగింతలు పెట్టటంతో మేనత్త కూతురికి భర్త చేసిన పన్లు నచ్చకపోవటంతో పక్కనే స్టూలు మీదున్న పన్నీరు బుడ్డి అందుకుని మొగుడు నెత్తిన మోదిందట! భర్త లబోదిబోమంటూ శోభనం గదిలోంచి బైటకొచ్చి వీధిన పడ్డాడట!

ఈ రోజుల్లో ఘోరమైన నేరాలకు పాల్పడుతూంటేనే న్యాయస్థానాలు కఠినంగ శిక్షించేటందుకు వెనక ముందు ఆలోచించి తీర్పులివ్వటం గమనార్హం!

అలాంటిది చిన్న తప్పులకు సైతం మహిళలు పూనకం వచ్చిన అమ్మోరులా వూగిపోతూ కట్టుకున్నవాడి మీదనో... కడుపున పుట్టిన బిడ్డల మీదనో లంఘించటం... చెడామడా వాయించి దేనితో పడితే దాంతో కొట్టటం దారుణం కదుటండీ (ఈ విషయంలో మగాళ్ళకు రాయితీ లేదు సుమా!)

చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలనే సామెత నేటి పరిస్థితులకు వర్తించదు.

★ ★ ★ ★ ★

మా ఇంటిపక్కవాటాలో ఓ తహసీల్‌దార్ అద్దెకుండేవాడు. ఆయన భార్య బ్రహ్మారాక్షసి. మొగుడ్ని నోరెత్తి మాట్లాడనిచ్చేదేకాదు. పెత్తనమంతా ఆమెదే! మొగుడి మొహాన కాఫీ కూడా పొయ్యదు. కడుపునిండా తిండి కూడా పెట్టదని ఆయన మా ఇంటికొచ్చి మా నాన్నతో అనేకసార్లు వాపోయాడు.

మళ్ళీ ఆమెగారిలో అన్నీ పాతివ్రత్యపు లక్షణాలే! తలారా స్నానం. గుడికెళ్ళి తడిగుడ్డల్తో ప్రదక్షిణాలు... ఇంట్లో నిత్యపూజ! వారానికోమారు ఓ గంటసేపు భజనకార్యక్రమం...!

పిల్లల్లేరు వాళ్ళకి. మొగుడ్ని మాత్రం చెండుకు తింటుంది!... మహాపతివ్రత అయిన అర్ధాంగి!

జీతం తీసుకోగానే సీల్డు కవర్ పెళ్ళాం చేతిలో పెట్టాల్సిందే!... లేకపోతే బెల్టుతో వుతికి ఆరేస్తుంది మొగుడ్ని. అలాంటి పతివ్రతాలలామకు ఓ చిన్న ముల్లు గుచ్చుకున్న క్షణాన విలవిలలాడి శోకాలు పెట్టి మంచమెక్కేది!

ఆయనకా వంటరాదు. హోటల్‌నుండి కేరియరా తేనివ్వదు. ఆ మొగుడి అవస్థ అంతా ఇంతా కాదు.

తాహసీల్దార్ అంకుల్ ఎంత మంచివాడో... భార్య అంత గయ్యాళి! ఎప్పుడూ సాధింపులు... వేధింపులు!

నేనోసారి వాళ్ళవాటాలోకెళ్ళాను. అక్కడి దృశ్యం చూస్తు చలనం లేకుండా వుండిపోయాను. మొగుడ్ని అప్పడాల కర్రతో కుళ్ళపొడుస్తోంది ఆంటీ!... ఇంకా అక్కడే వుండేందుకు భయంవేసి మా పోర్షన్లోకొచ్చి చూచింది అమ్మతో చెప్పాను. అమ్మ నన్నే కోప్పడింది. చూచిన విషయం ఎవరికీ చెప్పద్దంటూ వార్నింగిచ్చింది.

ఆ తర్వాత ఆరునెల్లకు ఆయన బదిలీ మీద మరో వూరెళ్ళిపోయారు.

ఆడవాళ్ళంటే... నాకు చిన్ననాటినుండీ భయమే! అందుకు నేను నా కళ్ళతో చూచిన దారుణ సంఘటనలే కారణమన్పిస్తూంటుంది.

ప్రముఖ సినిమా దర్శకులు శ్రీ కె.విశ్వనాథ్‌గారు తీసిన ఓ పిక్చర్లో భార్యలో దేవతను చూస్తాడు పూజారి. ఆ కారణంగానే ఆమెతో కాపురం చేయటానికి పూజారికి మనస్కరించదు! ఇదో దిక్కుమాలిన ఆలోచన!

అలాగే నేనూ ప్రతి స్త్రీలోనూ రాక్షసినే చూడటానికి అలవాటుపడ్డాను. అసలు పెళ్ళే చేసుకోకూడదని నిర్ణయించుకోకతప్పలేదు.

తర్వాత కొన్నాళ్ళకు నా మేనమామ కూతురు నన్ను అర్థం చేసుకుని... నాకు దగ్గరై... నా మనసు తెల్సుకుని లవ్వాడి నన్ను మేరేజ్ చేసుకుంది. నా పెళ్ళాంలో దేవతని చూశాను. అది వేరే సంగతి.

దానికీ అప్పుడప్పుడు కోపం వస్తూంటుంది. నాకేసి గుర్రుగా చూస్తుంది. నేను భయంతో వణికిపోవటం గమనించి పూనకాన్ని తానే తగ్గించుకుని పకపకా నవ్వేస్తుంది. దాని మూడ్ మారటంతో బతికిపోతాను.

ఇంతవరకు నన్నొకమాట అన్లేదు. నాపైకి చేయి ఎత్తలేదు. పళ్ళు పటపటమని కొరకటం కూడా చూచి ఎరగను. ఎంచక్కా ఏడాదికొకరు చప్పున అరడజను మందిని కని నా చేతుల్లో పెట్టింది. ఐయామ్ లక్కీ!

★ ★ ★ ★ ★

రాకరాక నాకు ప్రమోషన్ వచ్చిందనే పరమానందంలో కొలీగ్స్‌తో బార్‌కెళ్ళి సరదాగా రెండు పెగ్గులు మొదటిసారిగ పుచ్చుకుని చికెన్ బిర్యానీ తిని ఆటోలో ఇంటికెళ్ళాను.

తలుపు తీస్తూనే నా శ్రీమతి ఎలా పసికట్టిందో ఏమో పోలీస్‌డాగ్‌లా అరిచి మీదపడి నన్ను చావగొట్టినంత పనిచేసింది.

ఆమెలో ఆవిధమైన పరకాయ ప్రవేశానికి కారణం బోధపడక బుర్ర గోక్కున్నాను.

నేను మందు పుచ్చుకోవటమూ తొలిసారే... అమె రౌద్రం రూపం చూడటమూ మొదటిసారే!

భార్య భీకర పోజుకి బెదిరిపోయాను. తప్పుచేసిన వాడిలా తలదించుకున్నాను.

ఈ ఆడవాళ్ళున్నారే... యమడేంజర్! తుపాకులు... కత్తులతో పన్లేకుండానే కేవలం కళ్ళతో కంటిచూపుతో మొగుడ్ని కుళ్ళబొడిచేయగల హీరోయిన్లు సుమా అన్పించిందా క్షణంలో!

ఇంకా వారికి ఆయుధాలతో పనేముంటుంది?-

*('మల్లెతీగ' మాసపత్రికలో ప్రచురితం)*